ప్రభుత్వంపై వ్యతిరేకతగానే చూడాలి

వికారాబాద్, నవంబర్ 13: ఒకపక్క తనపై దాడి జరుగలేదని కలెక్టర్ చెప్తున్నారని, మరోవైపు దాడి చేశారంటూ పలువురు రైతులను అరెస్టు చేశారని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. లగచర్ల ఘటన ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఎత్తిచూపుతున్నదని తెలిపారు. రైతులతోపాటు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడం దారుణమని వెల్లడించారు.

దాడి జరుగలేదని కలెక్టరే చెప్తున్నారు కదా

నరేందర్ రెడ్డి ఐదేండ్లు ఎమ్మెల్యేగా పనిచేసిండు. కార్యకర్తలు తమకు ఏమైనా సమస్యలు ఉంటే ఆయనతో మాట్లాడుతుంటారు. ఇందులో తప్పేముంది? ఓ ప్రజా ప్రతినిధిగా సమస్యలు వినడం తప్పా? తనపై దాడి జరుగలేదని స్వయంగా కలెక్టరే చెప్పినా వినకుండా రైతులను అరెస్టు చేయడం, మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకోవడం ఎంత వరకు కరెక్టు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలు జరిగాయా? ప్రభుత్వ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం, మంత్రులు రైతుల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలి.

-కొప్పుల మహేశ్వర్‌రెడ్డి (పరిగి మాజీ ఎమ్మెల్యే)

రైతుల ఆగ్రహాన్ని అర్థం చేసుకోండి

బీఆర్ఎస్ పాలనలో రైతులను మెప్పించి ఎన్నో ప్రాజెక్టులు పూర్తి చేశాం. కానీ కాంగ్రెస్ పాలనలో రైతులు తిరగబడుతున్నరు. అధికారుల మీద కోపంతో లగచర్ల ఘటన జరుగలేదు. రేవంత్ సర్కార్‌పై రైతులు ఎంత ఆగ్రహంగా ఉన్నారో ఈ ఘటనను చూస్తే అర్థమవుతున్నది. ఇప్పటికైనా రైతులతో సీఎం రేవంత్ మాట్లాడాలి. చిన్నచిన్న ఘటనలకు భేషజాలకు పోవద్దు. అయినా సీఎం తన సొంత నియోజకవర్గ రైతులతో మాట్లాడటానికి ఇబ్బంది ఏది?. ప్రజలు, రైతులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే నిలదీస్తూనే ఉంటాం.

-మెతుకు ఆనంద్ (వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే)

కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనం

సీఎం సొంత నియోజకవర్గంలోనే ప్రజలు తిరగబడ్డారంటే కాంగ్రెస్ అసమర్థ పాలనకు ఇంతకంటే నిదర్శనం ఇంకొకటి ఉంటుందా?. ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయాలంటే ముందుగా రైతులతో మాట్లాడాలి. వారిని ఒప్పించాలి. అంతేగానీ రైతులను ఇబ్బందిపెట్టేలా వ్యవహరించకూడదు. లగచర్ల ఘటన ప్రభుత్వంపై జరిగిన దాడిగానే భావించాలి.

-డీకే అరుణ, (మహబూబ్‌నగర్ ఎంపీ)

భూములు గుంజుకోవడానికే..
గిరిజన నేత అంజయ్య

హిమాయత్‌నగర్, నవంబర్ 13: ఓవైపు గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నదని.. మరోవైపు వారి భూములను గుంజుకోవడానికి యత్నిస్తున్నదని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య విమర్శించారు. సాగుకు ఉపయోగపడని భూముల్లో కంపెనీలు ఏర్పాటు చేయాలని, పచ్చని పొలాల్లో కాదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతులపై హత్యాయత్నం కేసు

- లగచర్ల ఘటనలో 46 మందిపై నమోదు
- దాడిలో మూడు గ్రామాల ప్రజలు
- కలెక్టర్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసి హత్యకు ప్రయత్నించారు
- కావాలనే వారిని గ్రామంలోకి తీసుకెళ్లారు
- దాడి చేసినట్టు నిందితులు ఒప్పుకొన్నారు
- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : లగచర్ల ఘటనలో రైతులపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. భూసేకరణపై అభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ అధికారులపై కర్రలు, రాళ్లతో దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం, వారి విధులకు ఆటంకం కలిగించడం, అల్లర్లు సృష్టించడం వంటి ఘటనలకు సంబంధించి 46 మంది రైతులపై హత్యాయత్నంతో పాటు ఏడు సెక్షన్ల కింద కేసులు పెట్టారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 191(2)(3), 132, 109, 121(1), 126(2), 324(4) ఆర్/డబ్ల్యూ 190, సెక్షన్ -3 కింద కేసులు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి వికారాబాద్ డీఎస్పీ ఎన్ శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దుద్యాల మండలం లగచర్లలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) కోసం భూసేకరణకు సంబంధించి లగచర్ల శివారులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 11న ఉదయం 11 గంటలకు వికారాబాద్ డిప్యూటీ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు ఇన్‌చార్జి కలెక్టర్ ఉమాశంకర్, దుద్యాల తహసీల్దార్ కిషన్ నాయక్, కొడంగల్ తహసీల్దార్ విజయ్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి వచ్చారు. అక్కడికి వచ్చిన బోగనేని సురేష్ అభిప్రాయ సేకరణ మీటింగ్‌ను గ్రామంలో నిర్వహించాలని కోరాడు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్, ఇతర అధికారులు గ్రామంలోకి వెళ్లారు. అప్పటికే ముందుస్తు ప్రణాళికలో భాగంగా లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండా గ్రామస్థులు కర్రలు, రాళ్లు, కారంపొడి పోగేసి అక్కడ గుమిగూడారు. కలెక్టర్‌తో పాటు అధికారులు గ్రామంలోకి రాగానే నినాదాలు చేశారు. కలెక్టర్, ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి కారులోంచి దిగగానే వెంకట్‌రెడ్డిపై రైతులు దాడికి దిగారు. కలెక్టర్‌పై కూడా దాడి జరిగే ప్రమాదం ఉన్నదని గ్రహించిన ఇతర ఉద్యోగులు కలెక్టర్‌ను కారులోకి తీసుకెళ్లారు. గ్రామస్థుల దాడిలో కడా ప్రత్యేకాధికారికి గాయాలు కాగా పోలీస్ అధికారులకూ గాయాలైనట్టు రిపోర్ట్‌లోపేర్కొన్నారు.

గ్రామస్థులపై పెట్టిన కేసులు..

- సెక్షన్ 191(2)(3), 132, 109, 121(1), 126(2), 324 (4) ఆర్/డబ్ల్యూ 190, సెక్షన్ -3.
- **సెక్షన్ 191(2)(3):** అల్లర్లు సృష్టించడం, అశాంతిని నెలకొల్పడం, చంపేందుకు లేదా గాయపరిచేందుకు ఆదాయుధాన్ని ఉపయోగించడం. దీనికి ఐదేళ్ల పాటు జైలు శిక్ష.
- **సెక్షన్ 132:** విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం.. దీనికి రెండేళ్ల వరకు జైలు శిక్ష.
- **సెక్షన్ 109:** హత్యాయత్నానికి పాల్పడడం.. దీనికి పదేండ్లు లేదా జీవిత ఖైదు
- **సెక్షన్ 121(1):** ప్రభుత్వ ఉద్యోగి తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నందుకు గాను.. దీనికి ఐదేండ్ల వరకు శిక్ష.
- **సెక్షన్126(2):** నిర్బంధించడం.. దీనికి నెల వరకు జైలు శిక్ష
- **సెక్షన్ 324(4):** ఆస్తులకు నష్టం కలిగించడం.. దీనికి రెండేండ్ల వరకు శిక్ష

లోకం పోకడ



వికారాబాద్ కలెక్టరేట్‌లో రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

మన్నెగూడ పోలీస్‌స్టేషన్ వద్ద మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను అడ్డుకుంటున్న పోలీసులు

రేవంత్ సోదరుడికి సీఎం ప్రొటోకాల్

- తన చాంబర్ నుంచి బయకు వచ్చి మరీ కలెక్టర్ స్వాగతం
- అదే సమయంలో స్థానిక ఎంపీ డీకే అరుణ అడ్డగింత
- వార్డుమెంబర్ కూడా కాని రేవంత్ సోదరుడికి ఎస్కార్ట్‌పై అరుణ మండిపాటు.. కలెక్టర్‌కు ఫోన్
- హైవేపై బీఆర్ఎస్ నాయకుల వాహనాల తనిఖీ

వికారాబాద్/పూడూరు, నవంబర్ 13, (నమస్తే తెలంగాణ): లగచర్ల ఘటనపై కలెక్టర్‌ను కలిసేందుకు మండీమార్బలంతో వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి సీఎం స్థాయిలో ప్రొటోకాల్ కల్పించడం వివాదాస్పదమైంది. ఏ హోదా లేని తిరుపతిరెడ్డి కోసం కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అధికారులు బయటకువచ్చి స్వాగతం పలకడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే ఘటనకు సంబంధించి కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను మాత్రం మన్నెగూడ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకోవడం గమనార్హం.

వార్డుమెంబర్ కూడా కాని తిరుపతిరెడ్డికి ఎస్కార్ట్?

వికారాబాద్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న తనను అడ్డుకోవడంపై డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డు మెంబర్ కూడా కాని తిరుపతిరెడ్డిని ఎస్కార్ట్‌తో పంపించి, ఎంపీనైన తనను అడ్డగించి అవమానించడం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. అరుణను అడ్డగించడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు నినాదాలు చేశారు. పోలీసులు తనను అడ్డుకున్న విషయాన్ని అరుణ ఫోన్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీని పంపించాలని పోలీసులకు కలెక్టర్‌కు చెప్పడంతో వారు వికారాబాద్ పంపించారు.

మధ్యాహ్నం నుంచి వాహన తనిఖీలు

లగచర్ల ఘటనకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న మాజీమంత్రి హరీశ్‌రావు వస్తున్నారన్న సమాచారంతో హైవేపై పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగాయి. పూడూరు మండలం చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడు రోజులుగా హైవేపై విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి.

కాళ్లు పట్టుకున్నా కనికరించలే

నిండు గర్భిణి పట్ల ఖాకీల కర్కశత్వం

వికారాబాద్, నవంబర్ 13, (నమస్తే తెలంగాణ): నా భర్త పేరు ప్రవీణ్. మా ఆయనను విడిచిపెట్టండి.. మేం రైతులం, ఏడాదిగా ఫార్మా కోసం మా భూములివ్వలేమని ధర్నాలు చేస్తున్నాం. మొన్న జరిగిన ఘటనలో నా భర్త ఉన్నారు. మా పొలంతోపాటు మా ఇల్లు కూడా ఫార్మా విలేజ్ భూ సేకరణలో పోతుంది. నాపై దౌర్జన్యం చేసి నా భర్తను పోలీసులు తీసుకెళ్లారు. నేను 9 నెలల నిండు గర్భిణిని. స్కానింగ్ కోసం రేపు పొద్దున వికారాబాద్ వెళ్లేది ఉన్నందున నా భర్తను తీసుకెళ్లొద్దని, నాకు అత్త, మామ ఎవరూ లేరని చెప్పి ఎంత కాళ్లా, వేళ్లా పట్టుకొని బతిమిలాడినా పోలీసులు కనికరించకుండా నా భర్తను తీసుకెళ్లారు. నా పరిస్థితి చూసి మా అమ్మ మహారాష్ట్ర నుంచి వచ్చింది. నాకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు?' అంటూ లగచర్లకు చెందిన ఓ నిండు గర్భిణి కన్నీటి పర్యంతమైంది. ఉదయం పంపిస్తామని చెప్పి తీసుకెళ్లి రెండు రోజులవుతున్నా నా భర్త జాడ లేదని వాపోయింది. దవాఖానకు పోవడానికి కూడా పైసలు లేవు, ఇక స్కానింగ్ కూడా చేపించుకోలేదంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె రోదన గ్రామస్థులతోపాటు అందరికీ కన్నీళ్లు తెప్పిస్తున్నది. 'రేపు మాకు పుట్టే పిల్లలను పోషించాలంటే భూమి, ఇల్లు ఉండాలి కదా, దౌర్జన్యం చేసి రేవంతన్న ఉన్నందంతా గుంజుకుంటున్నడు. నా భర్త ఏ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నడో కూడా తెల్విదు, నేను గర్భిణిని ఎక్కడని వెతకాలి' అంటూ ఆమె బోరున విలపించింది.

నేడు ఎంప్లాయీస్ జేఏసీ నిరసనలు

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇతర అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలకు తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ పిలుపునిచ్చింది. ఉద్యోగ సంఘాల జేఏసీ అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ గురువారం ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొర్ర మోతీలాల్ నాయక్

రైతుల్ని విడుదల చేయాలి లేదంటే ఉద్యమిస్తాం

రేవంత్ సర్కార్‌ను హెచ్చరించిన బంజారా నేత మోతీలాల్

సైదాబాద్, నవంబర్13: లగచర్ల ఘటనలో అరెస్టు అయిన రైతులందరినీ విడుదల చేయాలని సేవాలాల్ బంజారా వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'ఫార్మా కంపెనీల పేరుతో గిరిజన భూములను లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారానికే ఇలా చేస్తున్నది. ఈ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలి. అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన రైతులందరినీ విడుదల చేయాలి. లేకుంటే గిరిజన సంఘాలన్నీ ఏకమై రేవంత్ సర్కార్‌పై పోరాటానికి సిద్ధమవుతాయి' అని హెచ్చరించారు. లగచర్ల, పులిచెర్లలో పోలీసులు దాడులు చేయడంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఏంచెయ్యాలో దిక్కుతోచని గిరిజనులు బంధువుల ఇండ్లలో తలదాచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ఆయనకు గిరిజనులపై ఎంతప్రేమ ఉన్నదో అర్థమవుతున్నదని మోతీలాల్ పేర్కొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా సంజీవ్ నాయక్..

'ఫార్మా' ఏర్పాటుపై నిజ నిర్ధారణ కమిటీ

నేడు గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సదస్సు

వెల్లడించిన సేవాలాల్, ఎల్‌హెచ్‌పీఎస్ ప్రతినిధులు

చిక్కడపల్లి, నవంబర్13: కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటు ఆవశ్యకతపై నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటుకు గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహిస్తున్నట్టు సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యాసంజీవ్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌బల్ నాయక్ తెలిపారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఈ సదస్సును నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య పార్కు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొడంగల్‌లోని గిరిజనుల భూములను లాక్కోవడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. లగచెర్ల, రోటిబండా తండా, పులిచర్ల కంట తండా, గడ్డమీది తండా, మైసమ్మ గడ్డ తండా, ఈదుల కుంట తండా, హక్కీం పేట తదితర తండాలను సందర్శించి వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రముఖులచే నిజానిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అన్నలూ.. జర మాట్లాడండే!

నాపై, నా అల్లుడిపై దాడి జరుగుతుంటే ఒక్కరూ మాట్లాడరా? • ఇదేమైనా నా ఒక్కడి కోసం చేస్తున్నానా?

లగచర్ల ఘటనపై మంత్రులను వేడుకున్న సీఎం! • ఒకరి తర్వాత ఒకరు వరుసగా మంత్రుల ప్రెస్‌మీట్స్

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'అన్నలు జర మాట్లాడండే. నాపై, నా అల్లుడిపై విమర్శల దాడి జరుగుతుంటే ఒక్క మంత్రి కూడా స్పందించకపోతే ఎట్లా. నేనొక్కడినే సమాధానం చెప్పుకోవాలా. మీరు ఎదురు దాడి చేయరా. ఇదేమైనా నా ఒక్కడి కోసం చేస్తున్నానా' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రులను వేడుకొన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. లగచర్ల ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నది. ఆయన అల్లుడి కోసమే లగచర్లలో భూసేకరణ చేస్తున్నారని ఆరోపిస్తున్నది. ఈ ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా తన సహచర మంత్రులెవరూ కూడా మాట్లాడటంలేదు. ఓ వైపు ఈ ఘటనపై బీఆర్ఎస్ విరుచుకుపడటం, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మరక్షణలో పడిపోయినట్టు చెప్తున్నారు. దీంతో బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి మంత్రులను వినియోగించుకోవాలని సీఎం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే బుధవారం మధ్యాహ్నం ఆయన వరుసపెట్టి మంత్రులకు ఫోన్ చేసినట్టు తెలిసింది. లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ ఆరోపణలపై ఎదురుదాడి చేయాలని వేడుకున్నట్టు సమాచారం. దీంతో అప్పటివరకు అంటీముట్టనట్టుగా ఉన్న మంత్రులు ఆ తర్వాత ఒకరి తర్వాత ఒకరు మీడియా ముందుకొచ్చారు. భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. లగచర్ల ఘటనను ఖండిస్తూ, బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగారు. లగచర్ల ఘటనలో ప్రభుత్వం తప్పేమీ లేకపోయి ఉంటే.. మంత్రులంతా ఎప్పుడో స్వచ్ఛందంగా మాట్లాడేవారని, కానీ ఏదో గూడుపుఠాని ఉంది కాబట్టే మంత్రులు దాని జోలికి వెళ్లడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంతానికి చేసుకుంటుంటే తామెందుకు బద్నాం కావాలి, తామెందుకు ఆయనకు సహకరించాలనే ధోరణిలో మంత్రులు వ్యవహరించినట్టు కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అందుకే ఈ ఘటనపై బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తున్నా మంత్రులంతా సైలెంట్‌గా ఉన్నట్టు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై దాడిని ఖండించరా : పొన్నం

రైతులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు అధికారులపై దాడిని ఎందుకు ఖండించడం లేదని మంత్రి పొన్నం ప్రశ్నించారు.

లగచర్ల ఘటనలో అసలు దోషులను త్వరలోనే మీడియా ముందుకు తీసుకొస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

దళిత, గిరిజన రైతులను రెచ్చగొడుతున్నారు: డిప్యూటీ సీఎం

లగచర్ల ఘటనలో దళిత, గిరిజన రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ చూస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. పరిశ్రమల ఏర్పాటుతో భూములు కోల్పోయే రైతుల బాధలు తమకు తెలుసునని అన్నారు. సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ... లగచర్లలో కలెక్టర్‌పై దాడి బీఆర్ఎస్ కుట్రనే అని అన్నారు. కలెక్టర్‌పై దాడి వెనుక ఎంతటివారు ఉన్నా ఉపేక్షించబోమని చెప్పారు. రాష్ట్ర గవర్నర్‌పై తమకు సంపూర్ణ విశ్వాసం ఉన్నదని, ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణకు ప్రజాప్రభుత్వానికి సహకరిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఒకవేళ గవర్నర్ తిరస్కరిస్తే చట్టం ప్రకారం ముందుకు వెళ్తామన్నారు.

కాలుష్య వికేంద్రీకరణ!

మళ్లీ పాత విధానాన్నే అమలు చేస్తున్న రేవంత్ సర్కారు • ఉమ్మడి ఏపీలో ప్రణాళిక లేకుండా పారిశ్రామికవాడలు ఫలితంగా నగరం నలుమూలలా కాలుష్య కాసారాలు • కాలుష్య మహమ్మారిని తరిమికొట్టేందుకే ఫార్మాసిటీ ఒకేచోట పరిశ్రమలకు బీఆర్ఎస్ సర్కారు పక్కా ప్రణాళిక • రాష్ట్ర నలుమూలలా ఫార్మా క్లస్టర్లకు ప్రభుత్వం మొగ్గు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబరు 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పరిధిలో తొలి పారిశ్రామికవాడ... ఆపై పటాన్‌చెరు... బాలానగర్... ఉప్పల్... జీడిమెట్ల... నాచారం... కాటేదాన్... ఇలా చెప్పుకుంటూ పోతే! నగరం నలువైపులా పరిశ్రమలే. కాలానుగుణంగా ఇప్పుడు ఇవన్నీ జనావాసాల మధ్యకు వచ్చేశాయి. ముఖ్యంగా ప్రణాళికాబద్ధంగా వీటి ఏర్పాటు జరగకపోవడంతో పర్యవేక్షణ-నియంత్రణ క్లిష్టతరమైంది. ఫలితంగా చుట్టూ కాలుష్య కాసారాల మధ్య నగరం ఇరుక్కుపోయింది. అందుకే హుస్సేన్‌సాగర్ మొదలు 54 నాలాలతో పాటు మూసీనది కూడా రసాయన వ్యర్థాలతో జీవం కోల్పోయాయి. అందుకే ఈ పరిశ్రమల్ని ఔటర్ రింగు రోడ్డు అవతలికి తరలించాలనేది ఉమ్మడి ఏపీ నుంచి దశాబ్దాలుగా నానుతున్న ప్రతిపాదన.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం దీనికో పరిష్కారాన్ని గుర్తించింది. ఒకేచోట పారిశ్రామికవాడ ఏర్పాటు చేయడం ద్వారా నియంత్రణ సులువు కావడంతోపాటు పర్యవేక్షణ పకడ్బందీగా ఉంటుందని భావించింది. అందులో భాగంగానే దాదాపు 20వేల ఎకరాల్లో ఫార్మాసిటీకి రూపకల్పన చేసి దాదాపు 14వేల ఎకరాల పైచిలుకు భూసేకరణ కూడా పూర్తి చేసింది.

నగరం చుట్టూ పరిశ్రమలు

హైదరాబాద్ పరిధిలో తొలి పారిశ్రామికవాడగా ఆజామాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు సమీపంలో ఉంది. తొలుత ఇక్కడే పరిశ్రమలు కొలువుదీరాయి. కాలక్రమేణా అది నగరం నడిబొడ్డుగా మారింది. దీంతో జనావాసాల మధ్య కాలుష్యకారక పరిశ్రమలు ఉండొద్దని ఆందోళనలు మొదలు కావడంతో క్రమేణా వాటిని తరలించారు. చార్మినార్-జూపార్కు ప్రాంతంలో దశాబ్దాల కిందటే ఉన్న రైస్, ఆయిల్ మిల్లులనూ జనావాసాలు పెరగడంతో తరలించారు. పారిశ్రామికవృద్ధిలో భాగంగా నగరం చుట్టూ బీహెచ్ఈఎల్, హెచ్ఎంటీ, ఈసీఐఎల్, హెచ్ఏఎల్, బీడీఎల్ ఇలా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు వచ్చాయి. ఇందులో భాగంగా వచ్చిన ఐడీపీఎల్‌తో ఫార్మా రంగం పురుడుపోసుకుంది. అందుకే దానిని మదర్ ఆఫ్ ఫార్మాగా అభివర్ణిస్తారు. వీటి తర్వాత ఉప్పల్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కాటేదాన్, నాచారం... వివిధ తయారీరంగాలకు చెందిన పారిశ్రామికవాడలు ఒక్కొక్కటిగా పుట్టుకొచ్చాయి. కాలానుగుణంగా ఇవి విస్తరించాయి. పటాన్‌చెరు పారిశ్రామికవాడను తీసుకుంటే రామచంద్రాపురం మొదలు ఇస్నాపూర్ వరకు విస్తరించింది. జీడిమెట్ల పారిశ్రామికవాడ ఇటు బాలానగర్‌ను ఆనుకొని పదుల కిలోమీటర్లు విస్తరించింది. ఈ వాడల విస్తరణతో కాలుష్యసమస్య కూడా తీవ్రతరమైంది. ఉమ్మడి రాష్ట్రంలో పారిశ్రామిక కాలుష్యం, రసాయన వ్యర్థాల నిర్వహణపై నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో భూగర్భజలాలు మొదలు జీవనది వరకు కాలుష్య కార్ఖానాలుగా తయారయ్యాయి. ఈ క్రమంలోనే పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు అవతలికి తరలించాలనే ప్రతిపాదన, డిమాండు ఉమ్మడి ఏపీలో నుంచే ఉంది. ఆ మేరకు గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగినా అవి పెద్దగా సఫలీకృతం కాలేదు.

పారిశ్రామిక ప్రగతి కోసమే ఫార్మాసిటీ

ఇప్పటికే ఉన్న పరిశ్రమలు విస్తరణకు సిద్ధమైనా.. కాలుష్యకోణంలో వాటికి అనుమతినిచ్చే పరిస్థితి లేదు. కొత్త పరిశ్రమలను ఇప్పుడున్న వాడల్లో ఏర్పాటు చేయడమూ వీలు కాదు. అందుకే కేసీఆర్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారంగా ఫార్మా సిటీకి రూపకల్పన చేసింది. ఇందుకోసం సుమారు 20వేల ఎకరాల భూసేకరణ లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో 14వేల ఎకరాలకు పైగా ఇప్పటికే సేకరించింది. 300కు పైగా కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. మొదటి దశ అనుమతులు కూడా వచ్చాయి. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో జీరో డిశ్చార్జితో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నందున.. వాటన్నింటినీ ఒకేచోట ఏర్పాటు చేసి పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టడం వల్ల కాలుష్య సమస్యను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని బీ